Acc. No. 3278

# ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం.ఏ., పిఎచ్.డి.

# ముత్యాలపాడు (పెదపవని)

## ప్రవేశిక

ఇది నెల్లూరు మండలము కావలి, కందుకూరు తాలూకాలలోనిది. ప్రాచీన సంస్థానములలో నొకటి. పెదపవని యనియు దీని నామాంతరము. పేష్కషు రూ. 2,000 లు. పెదపవని రాజనివాసము. ఆర్కాటు నవాబు మద్దత్తుగల కాళహస్తి జమీందారులు 1738 ప్రాంతముల ఈ సంస్థానమునందలి కొమ్మి మొదలైన సమీప గ్రామములను ఆక్రమించి కాళహస్తి జమీకి చెందిన పామూరు తాలూకాలో చేర్చికొనిరి.

## సంస్థాన చరిత్రము

ఈ సంస్థాన పాలకుల మూల పురుషుఁడైన చిట్నేని నరసారాయనింగారు హైదరాబాద్ సుబాలోని ఆమలూరు, గూడె మను గ్రామములను స్వాధీనపఱిచి కొని నవాబునకు సామంతుఁడై యుండెనఁట! ఇతని కుమారుఁడైన లక్ష్మీ కాంతరాయనింగారు నవాబు మీఁద తిరుగుబాటుచేసిన జాగీరుదారుల నోడించి, వారిని బాడుదలవట్టి తెచ్చి నవాబునుండి 'భూపాలరాయ భాలేరావు' బిరుదును, వెలిగందల, హనుమకొండ జాగీరులను సంపాదించెనఁట! వీరి కుమారుఁడు నరసింగ భూపాలభాలే రావు. ఈయన తనయుఁడు ధర్మభూపాల భాలే రాయ నింగారు. ఈ ధర్మభూపాల భాలే రాయనింగారు ముత్యాలపాటి సంస్థానాధి పతులకు కూటస్థుఁడఁట!

ఔరంగజేబు సేనాని యగు జుల్‌ఫికార్ ఖాన్ దక్షిణ హిందూదేశములోని కల్లోలముల నణఁచుటకు వచ్చినపుడు వాని సేనలో దండనాయకుఁడుగా ధర్మ భూపాల భాలే రాయనింగారు వర్తించినట్లు స్థానిక చరిత్రలు తెలుపుచున్నవఁట! ఈ సందర్భమునందు ధర్మ భూపాల భాలే రాయనింగారు ప్రదర్శించిన సాహ సమునకును, స్వామి భక్తికిని నవాబు సంతోషించి గండికోట తాలూకాను జాగీరుగా ప్రసాదించెనఁట! ఆ పిమ్మట ధర్మ భూపాల భాలే రాయనింగారు చంద్రగిరి, చిత్తూరు తాలూకాలను దీసికొని అచట నవాబు పక్షమున ఫౌజు దారుగా నుండెనఁట! ఆ పిమ్మట నెల్లూరి మండలములోని రాపూరి జాగీరులోని అనేక గ్రామములకు 'దేశముఖి ఫర్మానా' ను సంపాదించి ప్రాముఖ్యమునకు వచ్చిరి.

ఈయన కుమారుఁడు వెంకట కృష్ణ భూపాల భాలే రాయనింగారు.

పీరు హైదరాబాదు నవాబులనుండి కంభము, ఉదయగిరి సీమలకు దేశముఖీ సన్నదును సంపాదించిరి. వీరికి సంతతి లేనందున సమీపజ్ఞాతులలోని యొక చిన్నవానిని దత్తు తీసికొని పెంచి పెద్దచేసి రామచంద్ర భూపాల భాలే రాయనింగారను పేరుపెట్టి సంస్థానాధిపత్యము నప్పగించిరి. ఈ దత్తతను నవాబు ప్రతినిధి యగు నెల్లూరు ఫౌజుదారు గుర్తించి క్రొత్తగా సన్నదులను జారీ చేయించెను. రామచంద్ర భూపాల భాలే రాయనింగారికి సంతతి లేనందున అతని సోదరుఁడు వేంకటరాయ భూపాల భాలే రావు ఆ తరువాత పాలకుఁడుగా నియమితుఁడయినాఁడు. ఇతని పెద్ద కుమారుఁడు నరసింగ భూపాల భాలే రాయనింగారు. నరసింహుఁడు మరణించు నాఁటికి కొడుకులు మైనరులగుటచే నరసింహుని సోదరుఁడగు వేంకట కృష్ణ భూపాల భాలే రాయనింగారు తన పేర సన్నదు వ్రాయించికొనిరి. ఇతని తరువాత నీతని పెద్ద కొడుకు వెంకట రాయ భూపాల భాలే రాయనింగారు జమీకి వచ్చిరి. ఇతని కాలమునందే ఇంగ్లీషు కుంఫిణీవారికిని సంస్థానమునకును సరాసరి సంబంధము లేర్పడినవి. పదియవ తరము జమీందారు 1813 లో నిస్సంతుగా మరణించుట చేత నతని భార్య రామచంద్ర భూపాల భాలే రాయనింగారిని దత్తు తెచ్చిరి. ఇతఁడు బహుకాలము సంస్థానమును పాలించి, 'రాజా' బిరుదమునంది 1860 లో మరణించెను. ఈయన పెద్దకుమారులు రాజా వేంకటనరసింగభూపాల భాలేరాయనింగారు సంస్థానపాలకులలో పండ్రెండవతరమువారు.

ఈ కోవలోని శ్రీ రాజా సీతారామచంద్ర శ్రీరంగ భూపాల భాలే రాయనింగారు 1911 లో జమీందారులైరి. కిర్లమపూడి జమీందారులైన శ్రీ రాజా ఇనుగంటి వెంకట రాజగోపాల బుచ్చితమ్మయ్యగారి తనయను వీరు పరిణయమాడిరి. వీరి కుమారులు వేంకట సత్యనారాయణ భూపాల భాలే రావు. వీరు వెంకటగిరి రాజా గోవిందకృష్ణయాచేంద్రుల అల్లురు; నేఁటి వెంకటగిరి జమీందారుల బావమఱఁదులు. వీరే పెదపవని చివరి జమీందారులు.

## సాహిత్యపోషణము

ఈ సంస్థానాధీశుల యాస్థానములో నాది నుండియు మతుకుమల్లి వంశము వారు దివానులుగా, పండితులుగా వంశపరంపరగా నుండెడివారు. వీరిలో మతుకుమల్లి వెంగళప్పగారు ముఖ్యులు. ఇతని కుమారుఁడు మాదయామాత్యుఁడు. ఇతనికి 'చతుష్షష్టి కళల మాదయ మంత్రి' యను వ్యవహార నామముండినదఁట! ఈయనయును భాలే రాయనింగారి యాస్థానములో దివానుగా నుండిరఁట!

మతుకుమల్లివారు కాశ్యప గోత్రులు, ఆపస్తంబ సూత్రులు, మాల్యాద్రి నృసింహస్వామిభక్తులు. చతుష్షష్టికళల మాదయామాత్యుని జ్యేష్ఠకుమారుఁడు

కృష్ణయ్య. ఈ కృష్ణయ్య ప్రపౌత్రుఁడగు మాధవ మంత్రి అభినవ భారతగ్రంథ కర్త. ఇది అనంతభట్టకవి విరచితమగు సంస్కృత చంపూ భారతమును ననుసరించి విస్తృతముగను, కవిత్రయ రచితాంధ్ర భారతమును బట్టి సంగ్రహరూపముగను విరచితమైనది. ఈ కావ్యము హరిహర హిరణ్యగర్భాత్మకుఁడగు రమా హైమవతీ వాగ్వ్యవతీరామునకు త్రిమూర్తిస్వరూపునకు అంకితము. నెల్లూరిసీమ వాఁడే యయిన తిక్కన తన భారత కృతిని హరిహరేశ్వరున కంకితమీఁగా ఆ సీమకే చెందిన మడుపుమల్లి మాధవమంత్రి తన యభినవ భారత కృతిని హరిహర హిరణ్యగర్భేశ్వరున కంకితమిచ్చి తన నెఱజాణతనమును ప్రకటించినాఁడు.

మాధవమంత్రి అగ్రజులగు కనకామాత్యుఁడు వాసిరెడ్డివారి సంస్థాన పండితుఁడఁట! వీరు పిమ్మట మాణిక్యారావు వంశీయుల వలన చినరావూరి లోని మాన్యములను సంపాదించిరి. నెల్లూరుమండలమునందు ప్రఖ్యాతిగాయకు లయిన వీణ వీరాస్వామి అయ్యంగారు (19వ శతాబ్ది) ముత్యాలపాడు సంస్థానాస్థాన సంగీతవిద్వాంసులు. వీరు బుచ్చిరెడ్డిపాళెము వాస్తవ్యులు.

ముత్యాలపాడు జమీందారులలో పండ్రెండవ తరము వారైన రాజా శ్రీ నృసింహభూపాల భాలేరాయనింగారు ఆంధ్రభాషాపోషకులు. వీరు నెల్లూరునుండి పూండ్ల రామకృష్ణయ్యగారి సంపాదకత్వమున వెలువడుచుండిన 'అముద్రిత గ్రంథ చింతామణి' యను సాహిత్య మాసపత్రికకు నిత్యపోషకులుగాను, అనేక గ్రంథప్రచురణ సంస్థలకు రాజపోషకులుగాను నుండిరి. 1911 నాఁటి జమీం దారులు శ్రీ రాజా సీతారామచంద్ర శ్రీ రంగ భూపాల భాలే రాయనింగారు సంగీత సాహిత్యములలో విశేషాసక్తి కలవారు. ఆంధ్ర సాహిత్య పరిషద ధ్యక్షులుగా నుండి వీరు భాషా సాహిత్యముల యభ్యుదయమున కెంతేని తోడ్పడిరి. 1919 లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషదష్టమ వార్షికోత్సవ ఆహ్వానసంఘాధ్యక్షులుగా వీరొసఁగిన స్వాగతోపన్యాసము మహాసభకు విచ్చేసిన మహామహోపాధ్యాయ కళాప్రపూర్ణ తాతా సుబ్బరాయశాస్త్రి, కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రి వంటి ఉద్దండపండితుల మెప్పుకోలును బొందినది[1]. 'సూర్యరాయ నిఘంటువును వ్రాయించి యాంధ్ర ప్రపంచముయొక్క గొప్ప లోటును దీర్ప నడుకట్టిన పరిషత్తువారు, ఆంగ్ల సంస్కృతములకుం బలె నాంధ్ర మునకు సలక్షణశైలిని సంపూర్ణమగు వ్యాకరణమును రచియింపఁజేసి యీ లోటునుగూడఁ బాపవలసిన వారై యున్నారని విన్నవించెద' అని రాజాగా రానాఁటి తమ ఉపన్యాసమునందు సూచించుట గమనింపఁదగినది[2].

[1] నెల్లూరు జిల్లాలోని సంస్థానముల చరిత్ర, పు. 82, విక్రమసింహపురి మండల సర్వస్వము, ద్వితీయఖండము.

[2] ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, సిద్ధార్థి, చైత్రవైశాఖజ్యేష్ఠాషాఢములు, సంపుటి 8, సంచికలు 1, 2, పుటలు 13—24.

ప్రతివర్షము చైత్రమాసమున రాజాగారు వసంతోత్సవమును నిర్వహించి సంగీతవిద్వాంసులను, కవిపండితులను సత్కరించెడివారు. వీరికి సంగీతమన్న నభిమానమెక్కువ. బండేపల్లి సుబ్బయ్యశాస్త్రులుగారు వీరి ఆస్థాన పండితులలో నొకరు.

కళానిధి, మహోపాధ్యాయ, విద్యారణ్యపంచానన, విద్యావాచస్పతిత్యాది బిరుదాంకితులగు శ్రీమాన్ కళత్తూరు విక్రాల రామచంద్రాచార్యులుగారు (1879–1932) కలికివాయ గ్రామ వాస్తవ్యులు ఈ సంస్థానమున బహుకాల మాస్థాన పండితులుగా నుండిరి. వీరు తెంగళ శ్రీవైష్ణవశాఖకు చెందినవారు. భారద్వాజ గోత్రులు ; ఆపస్తంబసూత్రులు. తమ తండ్రియగు రామవాచార్యుల సన్నిధిని, మేనమామ యగు పర్ణశాల రాఘవాచార్యుల యొద్దను శాస్త్రాదుల పాఠము పరిశీలించినవారు. షడంగ విశిష్టక్రమాంత యజుర్వేద పారీణులు ; జైమినీయ పూర్వమీమాంసా పారంగతులు. వీరు ఆత్మకూరు, కాళహస్తి, గద్వాల, దోమకొండ, నరసరావుపేట, నూజివీడు, వనపర్తి మున్నగు ఆస్థానములను సైతము దర్శించి తమ పాండితీపటిమను బ్రకటించి సత్కారములందిరి. వీరు శతాధిక గ్రంథకర్తలు. కల్పసూత్ర సంగ్రహము, చిత్ర పంచాంగము, జనక జీవిత చరిత్రము, మానాంతరబోధము, వేదాంతము జడ్జిమెంట్, స్వరోచ్చారణ వైఖరి మున్నగు శాస్త్రగ్రంథములు వీరి ముఖ్యరచనలు. వీరి పాండిత్యమును దెలుపు శ్లోకమొకటి :

> 'వేదానాం సదనం తదర్థశరణం వేదాంగవిద్యాధనం
> షడ్దర్శిన్యవధారణం సకలవిద్యారణ్యపంచాననం
> వాగ్గంగాభరణం యశోధికరణం దుర్వాదివాం భీషణం
> విక్రాలాన్వయ భూషణం శుభగుణం శ్రీరామచంద్రం భజే'.

## ఉపజీవ్య గ్రంథసూచి

1. శ్రీరాం వీరబ్రహ్మకవి, నానారాజస్వచరిత్రము, పుటలు 39–45.

2. పూండ్ల రామకృష్ణయ్య, అముద్రిత గ్రంథ చింతామణి, 1886, ఏప్రిల్, సంపుటము 1, సంచిక 11.

3. విక్రాల శేషాచార్యులు, శ్రీ విక్రాల రామచంద్రాచార్యుల ప్రతిభ, భారతి, 1961 మే, పుటలు 23–32.

4. విక్రాల శేషాచార్యులు, పండితప్రకాండులు శ్రీ విక్రాల రామచంద్రాచార్యులు, ఆంధ్రప్రభ, 1967, ఏప్రిల్ 10, పు. 6.

5. Boswell, A.C. John, A Manual of the Nellore District in the Presidency of Madras, Chapter XXVII, pp. 712–740.

6. A. Vadivelu, The Aristocracy of Southern India, Vol. I.